క్వార్టర్స్‌లో అల్కరాజ్

ఆస్ట్రేలియా ఓపెన్

జ్వెరెవ్, మెద్వెదెవ్ ముందంజ

మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో నలుగురు కొత్తవాళ్లు

సీజన్ ఆరంభ గ్రాండ్‌స్లామ్ టోర్నీ.. ఆస్ట్రేలియా ఓపెన్‌లో రెండో సీడ్ కార్లోస్ అల్కరాజ్ క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. ప్రత్యర్థులతో సంబంధం లేకుండా.. తన అద్వితీయ ఫామ్ కొనసాగిస్తున్న ఈ నయా స్పెయిన్ బుల్.. ప్రిక్వార్టర్స్‌లో కెక్‌మానొవిక్‌పై అలవోకగా విజయం సాధించాడు. వరుస సెట్లలో ప్రత్యర్థిని మట్టికరిపించి ముందడుగు వేశాడు. మూడోసీడ్ మెద్వెదెవ్, జ్వెరెవ్ కూడా క్వార్టర్స్ చేరగా.. మహిళల సింగిల్స్‌లో నొకోవా, జెంగ్ ముందంజవేశారు. హోరాహోరీగా సాగిన పురుషుల డబుల్స్ ప్రిక్వార్టర్స్‌లో రోహన్ బోపన్న జోడీ సంచలన ప్రదర్శన కనబర్చింది.

మెల్‌బోర్న్: యువ ఆటగాడు కార్లోస్ అల్కరాజ్ ఆస్ట్రేలియా ఓపెన్ క్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. నిరుడు వింబుల్డన్ టైటిల్ నెగ్గిన ఈ 20 ఏండ్ల యంగ్‌గన్.. రాడ్ లీవర్ ఎరీనాలో జరిగిన ప్రిక్వార్టర్స్‌లో ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా చెలరేగిపోయాడు. సోమవారం పోరులో ప్రపంచ రెండో ర్యాంకర్ అల్కరాజ్ 6-4, 6-4, 6-0తో ప్రపంచ 60వ ర్యాంకర్ కెక్‌మానోవిక్‌పై ఏకపక్ష విజయం నమోదు చేసుకున్నాడు. గాయం కారణంగా నిరుడు ఆస్ట్రేలియా ఓపెన్‌కు దూరమైన అల్కరాజ్.. ఈసారి టోర్నీ ఆరంభం నుంచి అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్నాడు. గంటా 49 నిమిషాల్లో ముగిసిన ప్రిక్వార్టర్స్ పోరులో 20 ఏండ్ల అల్కరాజ్.. విశ్వరూపం కనబర్చాడు. మ్యాచ్‌లో ఐదు ఏస్‌లు కొట్టిన అల్కరాజ్ 43 విన్నర్లు కొట్టగా.. 14 విన్నర్లే బాదిన కెక్‌మానోవిక్ 17 అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకున్నాడు. అల్కరాజ్ క్వార్టర్ ఫైనల్‌కు చేరే క్రమంలో ఒక సెట్ మాత్రమే ఓడాడు. ఆ తర్వాత ప్రత్యర్థులకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా వరుస విజయాలతో ఫైనల్-8లో అడుగుపెట్టాడు. ఇతర మ్యాచ్‌ల్లో మూడోసీడ్ మెద్వెదెవ్ 6-3, 7-6 (7/4), 5-7, 6-1తో బోర్గెస్‌పై.. ఆరో సీడ్ జ్వెరెవ్ 7-5, 3-6, 6-3, 4-6, 7-6 (10/3)తో నోరీపై.. హుర్కాజ్ 7-6 (8/6), 7-6 (7/3), 6-4తో కాజక్స్‌పై విజయం సాధించారు. టాప్ సీడ్ జొకోవిచ్ ఇప్పటికే క్వార్టర్స్ చేరగా.. హుర్కాజ్‌తో మెద్వెదెవ్, జ్వెరెవ్‌తో అల్కరాజ్ తలపడనున్నారు.

నలుగురికి ఇదే తొలిసారి..

ఆస్ట్రేలియా ఓపెన్ మహిళల సింగిల్స్‌లో యంగ్ ప్లేయర్ల జోరు సాగుతున్నది. సీనియర్లకు షాక్ ఇస్తూ.. ఈసారి నలుగురు కొత్త ప్లేయర్లు గ్రాండ్‌స్లామ్ క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టారు. 12వ సీడ్ జెంగ్ 6-0, 6-3తో డాడిన్‌పై.. కలిన్‌స్కాయ 6-4, 6-2తో పావోలిన్‌పై.. యాస్ట్రెమ్‌స్కా 7-6 (8/6), 6-4తో అజరెంకపై విజయాలు సాధించారు. నొకోవాతో జరిగిన మరో ప్రిక్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నుంచి గాయం కారణంగా స్విటోలినా తప్పుకుంది. క్వార్టర్స్‌లో యాస్ట్రెమ్‌స్కాతో నొకోవా, కలిన్‌స్కాయతో జెంగ్ అమీతుమీ తేల్చుకోనున్నారు.

చెమటోడ్చిన బోపన్న జోడీ

ఇటీవలి కాలంలో వరుస విజయాలతో నిలకడైన ప్రదర్శన కనబరుస్తున్న భారత సీనియర్ ప్లేయర్ రోహన్ బోపన్న.. ఆస్ట్రేలియా ఓపెన్‌లో దుమ్మురేపుతున్నాడు. పురుషుల డబుల్స్‌లో ఆస్ట్రేలియా ప్లేయర్ మాథ్యూ ఎబ్డెన్‌తో జతకట్టిన బోపన్న క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టాడు. సోమవారం జరిగిన ప్రిక్వార్టర్స్‌లో బోపన్న-మాథ్యూ ద్వయం 7-6 (10/8), 7-6 (7/4)తో వెస్లీ-నికోలా మెక్టిక్ జంటపై గెలుపొందింది. రెండో సీడ్‌గా బరిలోకి దిగిన బోపన్న జంటకు.. 14వ సీడ్ జోడీ నుంచి గట్టి పోటీ ఎదురైంది. అయితే కీలక సమయాల్లో తన అనుభవాన్ని రంగరించిన 43 ఏండ్ల బోపన్న.. తిరుగులేని సర్వీస్‌లతో అదరగొట్టాడు. ఆద్యాంతం నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరులో బోపన్న జోడీ 5 ఏస్‌లు కొట్టి 31 విన్నర్లు సంధిస్తే.. 18 విన్నర్లకే పరిమితమైన ప్రత్యర్థి జంట మూల్యం చెల్లించుకుంది. క్వార్టర్ ఫైనల్లో ఆరో సీడ్ మాక్సిమా గొంజలాజ్-ఆండ్రెస్ మోల్టెనీ (అర్జెంటీనా)తో బోపన్న-మాథ్యూ తలపడనున్నారు. ప్రస్తుతం పురుషుల డబుల్స్ బరిలో ఉన్న అత్యుత్తమ ర్యాంకర్లు వీళ్లే కాగా.. మరో మూడు మ్యాచ్‌ల్లో ఇదే జోరు కొనసాగిస్తే.. బోపన్న ఖాతాలో తొలి ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్ చేరనుంది.

రవిశాస్త్రికి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు

నేడు ప్రదానం చేయనున్న బీసీసీఐ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత మాజీ ఆల్‌రౌండర్, చీఫ్ కోచ్ రవిశాస్త్రికి బీసీసీఐ జీవితకాల సాఫల్య పురస్కారం లభించనుంది. ఆటగాడిగా, కోచ్‌గా జాతీయ జట్టుకు సుదీర్ఘకాలం సేవలందించినందుకు గానూ ఈ అవార్డు అందించనున్నారు. మంగళవారం హైదరాబాద్ వేదికగా జరగనున్న అవార్డుల కార్యక్రమంలో యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్‌కు 'క్రికెటర్ ఆఫ్ ది ఇయర్' అవార్డు లభించనుంది. అవార్డుల కార్యక్రమానికి భారత్, ఇంగ్లండ్ జట్లు హాజరయ్యే అవకాశాలు ఉన్నాయని బీసీసీఐ అధికారి తెలిపారు.

ఐసీసీ టీ20 సారథిగా సూర్యకుమార్

దుబాయ్: పొట్టి ఫార్మాట్‌లో దుమ్మురేపుతున్న సూర్యకుమార్ యాదవ్ ఐసీసీ టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్‌కు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. తన దూకుడైన బ్యాటింగ్‌తో 360 డిగ్రీస్ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకున్న సూర్య ఐసీసీ జట్టుకు ఎంపికవడం ఇది వరుసగా రెండోసారి. సూర్యకుమార్‌తో పాటు టీమ్‌ఇండియా నుంచి యశస్వి జైస్వాల్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్ సింగ్ టీ20 టీమ్ ఆఫ్ ది ఇయర్‌లో చోటు దక్కించుకున్నారు. ఏడాది కాలంగా నమోదైన వ్యక్తిగత ప్రదర్శనల ఆధారంగా ఐసీసీ ఈ జట్టును ఎంపిక చేసింది.

ఒలింపిక్స్ అర్హత టోర్నీకి హుసామ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పారిస్ ఒలింపిక్స్ తొలి అర్హత టోర్నీలో భారత యువ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్ బరిలోకి దిగబోతున్నాడు. ఇటలీ వేదికగా ఫిబ్రవరి 29 నుంచి ఒలింపిక్స్ క్వాలిఫయర్స్ టోర్నీ జరుగనుంది. ఇందుకోసం జాతీయ బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్ఐ) సోమవారం జట్టును ప్రకటించింది. ఇందులో హుసామ్‌తో పాటు శివ థాపా, నిశాంత్‌దేవ్, లక్ష్య చాహర్, సంజీత్, నరేందర్, జాస్మిన్, అంక్షిత ఉన్నారు. ఇప్పటికే పారిస్‌కు నిఖత్ జరీన్, ప్రీతి, పర్వీన్, లవ్లీన బెర్తు దక్కించుకున్న సంగతి తెలిసిందే.

ఆశీర్వాద్, నిశిక పసిడి వెలుగులు

- ఖేలో ఇండియా యూత్‌గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తమిళనాడు వేదికగా జరుగుతున్న 6వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ ప్లేయర్లు ఆశీర్వాద్ సస్సేనా, నిశిక అగర్వాల్ పసిడి పతకాలతో మెరిశారు. సోమవారం జరిగిన 1కి.మీ వ్యక్తిగత సైక్లింగ్ ట్రాక్ ఈవెంట్‌లో ఆశీర్వాద్ 1:12:652 సెకన్ల టైమింగ్‌తో అగ్రస్థానంలో నిలిచాడు. ఇదే విభాగంలో వేదాంత్ జితేంద్ర(మహారాష్ట్ర), గుర్నూర్ పునియా(హర్యానా) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మరోవైపు అర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో నిశిక అగర్వాల్ 42.95 స్కోరుతో స్వర్ణ పతకం సాధించింది. సౌమిలి(పశ్చిమబెంగాల్), సారా(మహారాష్ట్ర) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. మహిళల సౌత్‌జోన్ వుషూ పోటీల్లో రాష్ట్రానికి స్వర్ణం, మూడు రజతాలు, 18 కాంస్య పతకాలు లభించాయి.

తొలి రెండు టెస్టులకు కోహ్లీ దూరం

విరాట్ లేకుండానే హైదరాబాద్, విశాఖపట్నం మ్యాచ్‌లు

వ్యక్తిగత కారణాలతో తప్పుకున్న మాజీ కెప్టెన్

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ.. ఇంగ్లండ్‌తో తొలి రెండు టెస్టులకు అందుబాటులో ఉండటం లేదని వెల్లడించాడు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ మధ్య గురువారం నుంచి ఉప్పల్ వేదికగా తొలి టెస్టు ప్రారంభం కానుండగా.. ఆదివారం కోహ్లీ తన నిర్ణయం తెలిపాడు. వ్యక్తిగత కారణాల వల్ల సిరీస్‌లో మొదటి రెండు మ్యాచ్‌లు ఆడలేనని బోర్డుకు నివేదించాడు. తొలి టెస్టుకు హైదరాబాద్ ఆతిథ్యమిస్తుండగా.. వచ్చే నెల 2 నుంచి విశాఖపట్నంలో రెండో టెస్టు ప్రారంభం కానుంది. ఈ రెండు మ్యాచ్‌లకోసం సెలెక్షన్ కమిటీ ఇప్పటికే జట్టును ప్రకటించిన విషయం తెలిసిందే. 'కెప్టెన్ రోహిత్ శర్మ, టీమ్ మేనేజ్‌మెంట్, సెలెక్టర్లతో కోహ్లీ మాట్లాడాడు. దేశానికి ప్రాతినిధ్యం వహించడం తన తొలి ప్రాధాన్యమే అయినా.. వ్యక్తిగత తప్పని పరిస్థితుల కారణంగా.. రెండు మ్యాచ్‌లకు అందుబాటులో ఉండనని వెల్లడించాడు. విరాట్ నిర్ణయాన్ని గౌరవిస్తున్నాం' అని బీసీసీఐ కార్యదర్శి జై షా పేర్కొన్నాడు. 2021లో ఆస్ట్రేలియాతో సిరీస్ సమయంలోనూ కోహ్లీ ఇలాగే పితృత్వ సెలవులు తీసుకోగా.. మళ్లీ ఇప్పుడు విరాట్ సతీమణి విరుష్క రెండో బిడ్డకు జన్మనివ్వనున్న నేపథ్యంలో అతడు బ్రేక్ తీసుకున్నట్లు సమాచారం. కోహ్లీ స్థానాన్ని భర్తీ చేసేదెవరో సెలెక్షన్ కమిటీ ఇంకా వెల్లడించలేదు. సీనియర్ బ్యాటర్ చతేశ్వర్ పుజారా, రజత్ పాటిదార్, సర్ఫరాజ్ ఖాన్ జట్టులో చోటు ఆశిస్తున్నారు.

శభాష్ భవజ్ఞ

ఫెన్సింగ్ విజేతలకు మంత్రి పొన్నం అభినందన

హైదరాబాద్, జనవరి22 (నమస్తే తెలంగాణ): జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన నల్లగొండ జిల్లా తుమ్మడంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థినులను బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో భవజ్ఞ బంగారు పతకం, అక్షయ, మనస్విని, హరిప్రియ రజత పతకాలను సాధించారు. సోమవారం సచివాలయంలో మంత్రిని వారు మర్యాదపూర్వకంగా కలవగా, ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, బీసీ గురుకులాల కార్యదర్శి మల్లయ్య భట్టు, ప్రిన్సిపాల్ రాములు, పీఈటీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

టైటాన్స్ బోల్తా

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం వేదికగా జరుగుతున్న ప్రొ కబడ్డీ లీగ్(పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ ఖాతాలో మరో ఓటమి. సోమవారం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో టైటాన్స్ 30-37తేడాతో హర్యానా స్టీలర్స్ చేతిలో ఓటమిపాలైంది. గత మ్యాచ్‌లో యూపీ యోధాస్‌ను ఓడించిన టైటాన్స్ అదే జోరు కొనసాగించడంలో విఫలమైంది. రైడింగ్‌లో టైటాన్స్ 16 పాయింట్లు సాధిస్తే.. హర్యానా 16 పాయింట్లతో సమంగా నిలిచింది. కానీ డిఫెన్స్‌లో టైటాన్స్ 7 పాయింట్లకు పరిమితం కాగా, హర్యానా 18 పాయింట్లు సొంతం చేసుకుంది. 15 మ్యాచ్‌లాడిన టైటాన్స్‌కు ఇది 13వ ఓటమి.

కేబీడీ జూనియర్స్ విజేత ఓబుల్‌రెడ్డి స్కూల్

హైదరాబాద్: కేబీడీ జూనియర్స్ సీజన్-4లో హైదరాబాద్ విజేతగా ఓబుల్‌రెడ్డి స్కూల్ నిలిచింది. ఆదివారం గచ్చిబౌలి స్టేడియంలో జరిగిన ఫైనల్ పోరులో ఓబుల్‌రెడ్డి స్కూల్ 25-14తో సిస్టర్ నివేదిత పాఠశాలపై అద్భుత విజయం సాధించింది. టైటిల్ దక్కించుకున్న ఓబుల్‌రెడ్డి స్కూల్ నేషనల్స్‌కు అర్హత పొందింది. వివిధ నగరాల నుంచి ఎంపికైన 12 జట్లతో జాతీయ స్థాయిలో ఫైనల్ నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన వేదిక, తేదీలను త్వరలో ప్రకటించనున్నారు.

ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో సోమవారం రామమందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, సీనియర్ షట్లర్ సైనా నెహ్వాల్, మాజీ కెప్టెన్ మిథాలీరాజ్. అంగరంగ వైభవంగా జరిగిన ఈ వేడుకలో క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అనిల్‌కుంబ్లే, వెంకటేశ్ ప్రసాద్, రవీంద్ర జడేజా తదితరులు హాజరయ్యారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.